## క్లుప్తంగా

### సంక్రాంతి శుభాకాంక్షలు


వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే


కేతిరెడ్డి పెద్దారెడ్డి మాజీ ఎమ్మెల్యే

**గుంతకల్లు టౌన్:** నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో సరికొత్త కాంతి నింపాలని, ప్రతీ రైతు ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నట్లు సోమవారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**తాడిపత్రి:** తాడిపత్రి నియోజకవర్గ ప్రజలందరూ సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి ఇళ్లలో సంక్రాంతి కాంతులు వెల్లివిరియాలని, సుఖసంతోషాలతో, సౌభాగ్యాలతో, ధన, ధాన్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

### గురుస్వాములకు సన్మానం


గురుస్వాములను సత్కరిస్తున్న అయ్యప్ప మాలధారులు

**గుత్తి:** గుత్తి ఆర్ఎస్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం అయ్యప్ప గురుస్వాములు, అర్చకులకు అయ్యప్ప మాలధారులు, శిష్యులు ఘనంగా సన్మానించారు. ఇరుముడి వేసుకుని శబరిమల వెళ్లే సమయంలో గురుస్వాములను శాలువాలతో సత్కరించారు.

# కమనీయం.. గోదాదేవి కళ్యాణోత్సవం


గుంతకల్లులోని వేంకటేశ్వరాలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పామిడిలో పూజలందుకుంటున్న భోగేశ్వరస్వామి, కన్యకా పరమేశ్వరి అమ్మవారు

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి, విష్ణుమూర్తి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. అర్చకులు గోదాదేవి, విష్ణుమూర్తిని విశేషపుష్పాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు విందు ఏర్పాటుచేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణ స్వామి, సభ్యులు తదితరులు భక్తులకు సేవలందించారు.

**భోగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు..**

**పామిడి:** పట్టణంలోని భోగేశ్వరాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమి, భోగి పండుగ కలసి రావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్, సోమశంకర్ తదితరులు మూలవిరాట్ శివలింగం, ప్రసన్న పార్వతీదేవి విగ్రహాలను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక అభిషేక, అర్చనలు, మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

**ముగిసిన ధనుర్మాస పూజలు..**

**పామిడి:** పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నెలరోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస పూజలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా గోదాదేవి, శ్రీకృష్ణ భగవానుని విశ్వరూప సందర్శన చిత్రపటాన్ని, కన్యకా పరమేశ్వరీమాతాను శోభాయానంగా అలంకరించి, వేదపండితుడు రఘునాథ్‌శర్మ మంత్రోచ్చరణల నడుమ విశేష పూజలు చేశారు. భక్తులు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

## సైక్లింగ్ క్రీడాకారులకు సన్మానం


సైక్లింగ్ క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

**గుంతకల్లు:** జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారులను అనంతపురం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం పట్టణంలోని బీఆర్‌కే సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 68వ స్కూల్ గేమ్ ఫేడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్-2024 విజయవాడలో రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో వజ్రకరూరు మండలం కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అండర్-19 బాలికల విభాగంలో నందిని పాల్గొని బంగారు పతకం సాధించారన్నారు. అలాగే గడేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లవణ్‌కుమార్ అండర్-19 బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో సాధించారు. వీరు ఈ నెల 22న బీహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. వారిని ఆయనతోపాటు జిల్లా కార్యదర్శి పాండురంగ, ఫౌండర్ మల్లికార్జున, హెచ్ఎంలు తిమ్మారెడ్డి, నారయణరెడ్డి, శ్రీనివాసులు, పుండరీకాక్ష సన్మానించి జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ ఆయూబ్‌ఖాన్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు మల్లికార్జున, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యల్లనూరులో 18, 19న పెద్దమ్మ జాతర

**యల్లనూరు:** మండల కేంద్రంలో ఈ నెల 18,19వ తేదీల్లో పాతపేటలో వెలసిన పెద్దమ్మ అమ్మవారి జాతర నిర్వహించన్నారు. జాతరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు సోమవారం తెలిపారు. ఇప్పటికే గ్రామస్తులు జాతరకు సిద్ధమయ్యారు. బంధువులు, స్నేహితులను జాతరకు ఆహ్వానించారు.

### కోడి పందేలు ఆడితే జైలుకే..


సీఐ సత్యబాబు

**యల్లనూరు:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో పల్లెల్లో కోడిపందేలు ఆడినా, ప్రోత్సహించినా జైలుకు పంపుతానని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. చిన్నచిన్న సమస్యలను పెద్దవి చేసి రాజకీయ రంగులు పులిమితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**గార్లదిన్నె:** సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. సోమవారం సీఐ మాట్లాడుతూ మంగళవారం సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎవరైనా కోడి పందేలు ఆడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలన్నారు. కోడి పందేలు ఆడేందుకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. పండుగు ప్రశాంతంగా చేసుకోవాలన్నారు.

### అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

**పెద్దవడుగూరు:** గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని క్రిష్టిపాడు, అప్పేచర్ల, జి.వెంకటాంపల్లి, విరుపాపురం, ఆవులాంపల్లి తదితర గ్రామాల్లో ఎస్ఐ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సంకాత్రి పండుగను పురస్కరించుకుని కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా జూదాలు ఆడటం కాని, నిర్వహించడం కాని చేస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### సబ్సిడీతో సూర్యఘర్ పథకం అమలు చేయాలి

**గార్లదిన్నె:** సబ్సిడీతో సూర్యఘర్ సౌర విద్యుత్ పథకం అమలు చేయాలని రాయలసీమ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూర్యఘర్ పథకం ప్రతి ఇంటికి ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకులు తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం కెనరా బ్యాంకు ఆఫీసర్ అనురాధకు అందజేశారు. రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ ,సభ్యులు తాతిరెడ్డి, శివశంకర్, నీలకంఠ, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆదివాసి సమ్మేళనానికి తరలిరండి


పోస్టర్లు విడుదల చేస్తున్న గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు

**శింగనమల:** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 19న నిర్వహించే గిరిజన ఆదివాసి సమ్మేళన మహాసభకు గిరిజనులంతా తరలిరావాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నాయక్ కోరారు. సోమవారం శింగనమల మండలంలోని నాగులగుడ్డం తండా గ్రామంలో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ గిరిజనులంతా సంఘటితమై హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమించాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జాతీయ ఎస్టీ కమిషన్ మెంబరు హుసేన్ నాయక్, ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్, కేరళ ఐజీ లక్ష్మణనాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, అంజినేయులు, లక్ష్మానాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలు తగ్గించాలి


తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


బీకేఎస్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

**తాడిపత్రి అర్బన్:** విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీసీపీఎం వినూత్న రీతిలో నిరసన చేపట్టంది. సోమవారం స్థానిక మహాత్మాగాంధీ సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంభూపాల్ తదితరులు కరెంట్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈసందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో బాగంగా భూటకపు హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి పేదల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం చంద్రబాబు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పేదవారికి ఇళ్లు నిర్మిస్తామని హామీ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **బుక్కరాయసముద్రం:** శింగనమల నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు నిరసనలు వ్యక్తం చేశారు. సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. బీకేఎస్‌లో చేపట్టిన కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప నేతృత్వం వహించారు. సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, నాగేంద్ర, సంజీవరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల్, హరికృష్ణ పాల్గొన్నారు.
- **గుత్తి:** మున్సిపాలిటీ పరిధిలోని జడ్ వీరారెడ్డి కాలనీలో సోమవారం సీపీఎం నాయకులు విద్యుత్ చార్జీలను తగ్గించాలని నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కన్వీనర్ నిర్మల ఆధ్వర్యంలో కాలనీవాసులు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి.. కరెంట్ బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు


తాడిపత్రిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భోగి మంటల దృశ్యం


పామిడిలో ఒక ఇంటి ముందు వేసిన ముగ్గు

**తాడిపత్రి అర్బన్/గుత్తి/గుత్తిరూరల్/యల్లనూరు/గార్లదిన్నె/పామిడి:** తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో సంక్రాంతి వేడుకలను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. మహిళలు వేకువజామునే నిద్రలేచి ఇళ్ల ముందు కళ్లాపి చల్లి రంగవల్లులను తీర్చిదిద్దారు. ముగ్గుల మధ్యలో గొబ్బెమ్మలను ఉంచి పూజలు నిర్వహించారు. నూతన సంవవత్సరంలో వచ్చిన తొలి పండుగ కావడంతో ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి సంప్రదాయ వంటకాలైన సద్దరొట్టి, గుమ్మడికాయ కూర, అనపకాయ కూర, ప్రతి ఇంట్లో దర్శనమిచ్చాయి. సాయంత్రం చిన్నారులు పతంగులను ఎగురవేశారు. తాడిపత్రిలోని చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. అలాగే బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గుత్తిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్య మహిళలు భోగి మంటలు వేసి సంబరాలు నిర్వహించారు. మండలంలోని సేవాగఢ్‌లోని సంత్ సేవాలాల్ మహారాజ్, మాతా జగదాంబ ఆలయ ఆవరణలో గోపూజ చేశారు. అలాగే యల్లనూరు, పామిడి, గార్లదిన్నె మండలాల్లో భోగి మంటలు వేసుకున్నారు.